
సాక్షి నిర్మల్

గురువారం : 9 : జనవరి : 2025



రైల్వేలైన్ మళ్లీ మొదటికి..!
ఆర్మూర్–నిర్మల్–ఆదిలాబాద్ రైల్వేలైన్ కథ మళ్లీ మొదటికొచ్చింది. ఈ లైన్ ఎప్పుడు ప్రారంభమవుతుందోనని నిర్మల్, ఆదిలాబాద్ ప్రజలు చర్చించుకుంటున్నారు. 8లో▸



డ్రాగన్ పండుతోంది 9లో▸
జిల్లాలోని పలువురు యువరైతులు 'డ్రాగన్' సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు. జిల్లాలో 11.22 ఎకరాల్లో ఈ పంట సాగవుతున్నట్లు హార్టికల్చర్ అధికారులు చెబుతున్నారు.

గరిష్టం/కనిష్టం
28.0 / 15.0

వాతావరణం
కనిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. చలి కొనసాగుతుంది. రాత్రి మంచు కురుస్తుంది.

గుర్తుండిపోయే ఉత్సవం

- ఇక నుంచి ఏటా నిర్వహిద్దాం
- చరిత్ర, సంస్కృతిని చాటుదాం
- మనవైన వంటలను గుర్తిద్దాం
- నిర్మల్‌కు బ్రాండ్‌నేమ్ తెద్దాం
- నిర్మల్ ఉత్సవాలపై జిల్లా జనం
- అట్టహాసంగా ముగింపు వేడుక



ఉత్సవాల వేదికపై జిల్లా అధికారులతో కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్: వేదవ్యాసుడు చదువులమ్మకు పురుడుపోసిన బాసర నుంచి బౌద్ధాన్ని దక్షిణాపథానికి విస్తరించిన భావరి నివసించిన బాదన్‌కుర్తి వరకు గోదావరి ఒడ్డున విలసిల్లింది నిమ్మల. ఓరుగల్లు, గోల్కొండకు తీసిపోని విధంగా నిర్మల్‌లో కట్టడాలు, చరిత్ర దాగి ఉంది. ఇంతటి చారిత్రక, సాంస్కృతిక నేపథ్యమున్న నిర్మల్‌కు ఓ పేరు తీసుకువచ్చే క్రమంలో నాలుగురోజుల పాటు చేపట్టిన 'నిర్మల్ ఉత్సవాలు–2025' జిల్లా చరిత్రలో గుర్తుండిపోనున్నాయి. నిర్మల్‌కు బ్రాండ్‌నేమ్ తీసుకువచ్చేలా అట్టహాసంగా సాగిన ఈ వేడుకలు ఒక కొత్త ట్రెండ్‌కు నాంది పలికాయి. 'అయ్యో.. ఇన్నాళ్లు కనీసం ఈమాత్రం చరిత్రను కూడా తెలుసుకోలేక పోయాం..' అన్న భావనను కలిగించేలా జిల్లా చరిత్రను బోధించాయి. స్థానిక సంస్కృతితోపాటు ఇక్కడి వంటకాలను మరోసారి జిల్లావాసులకు గుర్తుచేశాయి. అక్కడక్కడా కొన్నిలోపాలున్నా.. జిల్లాలో తొలిసారి నిర్వహించిన 'నిర్మల్ ఉత్సవాలు' విజయవంతమయ్యాయి. కలెక్టర్ మొదలు కిందిస్థాయి సిబ్బంది వరకు ప్రతీ అధికారి, ఉద్యోగి, సిబ్బంది దాదాపు వారంపదిరోజుల పాటు ఈ ఉత్సవాల విజయవంతానికి కృషిచేశారు.

ఓ బ్రాండ్‌నేమ్ కావాలి

కోటగోడలు, కొయ్యబొమ్మలే కాదు.. నిర్మల్ అంటే వెయ్యిమంది అమరవీరుల త్యాగాలగడ్డ.. అన్న విషయం ఇప్పటికీ జిల్లాలోనే చాలామంది తెలియదంటే అతిశయోక్తి కాదు. ఇక పక్కజిల్లాలు, రాష్ట్రంలో జిల్లా చరిత్ర తెలిసినవాళ్లు అరుదు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన పోటీపరీక్షల్లో వరుసగా జిల్లా చరిత్ర గురించి ప్రశ్నలు వస్తూనే ఉండటం గమనార్హం. కానీ.. వాటికి సమాధానాలు చెప్పే చరిత్రే వెలుగులోకి రావడం లేదు. ఈక్రమంలోనే ఓరుగల్లు, ఎలగందల్, భువనగిరి, గోల్కొండ తరహాలో జిల్లా వాసులంతా.. 'నిర్మల్'కు ఓ బ్రాండ్‌నేమ్ రావాలని కోరుకుంటున్నారు. ఇదే సందర్భం, ఇలాంటి ఉద్దేశంతోనే కలెక్టర్ అభిలాషఅభినవ్ ఉ త్సవాలు నిర్వహించడం జిల్లావాసులను ఆకట్టుకుంది.

కళ్లకు కట్టేలా..

తొలిసారి చేపట్టిన నిర్మల్ ఉత్సవాల్లో నాలుగు రోజుల పాటు సాధ్యమైనంత వరకు నిర్మల్ హిస్టరీని కాలానుగుణంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ కట్కం మురళి వివరించారు. హిస్టోరియన్ థోండి శ్రీనివాస్, వీడియోగ్రాఫర్ రాంరాజ్ తీసిన 'నిమ్మల చరిత్ర'ను ప్రదర్శించారు. ఔత్సాహిక చరిత్రకారుడు, ఉపాధ్యాయుడైన తుమ్మల దేవరావు చారిత్రక అంశాలతో పాటు పాతకాలపు స్థానిక వస్తుసంపదను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. మహిళా సంఘాలతో పాటు స్థానిక పలు హోటళ్ల నిర్వాహకులు ఫుడ్‌కోర్టులు పెట్టారు. కానీ.. ఇంకా ఏదో మిస్ అవుతోందన్న భావన చాలామందిలో కనిపించింది. కోటలు, మహళ్లు, వెయ్యి ఉరులమర్రి వంటివి కళ్లకు కట్టించేలా ఏర్పాటు చేసి ఉంటే మరింత బాగుండేదన్న అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. వంటకాల్లో స్థానికమైనవే ఎక్కువ ఉండాల్సిందని పేర్కొన్నారు.



నిర్మల్ ఉత్సవాలకు హాజరైన ప్రజలు



సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు



నృత్యం చేస్తున్న చిన్నారులు

చరిత్రకు పట్టం..



కలెక్టర్ అభిలాషఅభినవ్ ఆధ్వర్యంలో చేపట్టిన నిర్మల్ ఉత్సవాలు జిల్లా చరిత్రకు పట్టం కట్టాయి. నాలుగు రోజుల వేడుకల్లో జిల్లా హిస్టరీ గురించి చెప్పే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నాను.
– కట్కం మురళి, అసిస్టెంట్ ప్రొఫెసర్

గొప్ప ప్రయత్నమిది



జిల్లా ఘనమైన సంస్కృతి, చరిత్రను నిర్మల్ ఉత్సవాల్లో యాంకర్‌గా ప్రపంచానికి పరిచయం చేసే అవకాశం దక్కింది. జిల్లా ఘనతను చాటే గొప్ప ప్రయత్నమిది. ఇది ఇక్కడితోనే ఆగిపోవద్దని కోరుకుంటున్నా.
– రవిబాబు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

కళలకూ ప్రోత్సాహం



కలెక్టర్ అభిలాషఅభినవ్ సారథ్యంలో చేపట్టిన నిర్మల్ ఉత్సవాలు చరిత్ర, సంస్కృతితో పాటు మనవైన కళలు, కళాకారులనూ అందరికీ పరిచయం చేయడం హర్షణీయం. కళలు, కళాకారులకూ ప్రోత్సాహం లభించింది.
– చెనిగారపు నాగరాజు, సాంస్కృతికశాఖ

నిర్మల్ చరిత్ర చాలా గొప్పది



మాది నల్గొండ జిల్లా కనగల్ మండలం పానుగోడు గ్రామం. వృత్తిరీత్యా పదేళ్లుగా నిర్మల్‌లో ఉంటున్నాం. నిర్మల్ ఉత్సవాల ద్వారా ఇక్కడి చరిత్ర, సంస్కృతిని మరింత తెలుసుకున్నాం. ఇక్కడి గొలుసుకట్టు చెరువులు, చరిత్ర చాలా గొప్పది. – భారతి, బాలకృష్ణ, నల్గొండ జిల్లా

ముగిసిన 'నిర్మల్ ఉత్సవాలు'

- సమష్టి కృషితోనే సక్సెస్
- కలెక్టర్ అభిలాష అభినవ్



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్: జిల్లా చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను చాటిన నిర్మల్ ఉత్సవాలు విజయవంతం అయ్యాయని కలెక్టర్ అభిలాష అభినవ్ పేర్కొన్నారు. ఉత్సవాల నిర్వహణకు సహకరించిన జిల్లా ప్రజలు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నాలుగు రోజులపాటు నిర్వహించిన 'నిర్మల్ ఉత్సవాలు–2025' బుధవారం రాత్రి అట్టహాసంగా ముగిశాయి. రోజంతా స్టాళ్లు కొనసాగాయి. సాయంత్రం వివిధ విద్యాసంస్థలు, డ్యాన్స్ అకాడమీల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. పలువురు కళాకారులు వివిధ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. చివరిరోజు చరిత్ర బోధనలో భాగంగా హిస్టోరియన్ థోండి శ్రీనివాస్ నిర్మల్ పట్టణ చరిత్రను వివరించారు. సాయంత్రం భారీగా తరలివచ్చిన పట్టణవాసులు, వివిధ మండలాల ప్రజలు స్టాళ్లు, సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. స్థానిక వంటకాలను రుచి చూశారు. చిన్నారులు తమ కోసమే ఏర్పాటు చేసిన ఆటల్లో మునిగితేలారు.

వచ్చే ఏడాది మరింత ఘనంగా..

నిర్మల్ ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడారు. జిల్లా ప్రజలందరి సమష్టి సహకారంతోనే తొలిసారిగా నిర్మల్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించామని పేర్కొన్నారు. జిల్లాలో ఈ ట్రెండ్‌ను కొనసాగిస్తామని, వచ్చే ఏడాది మరింత ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. వేడుకల నిర్వహణకు జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది చాలా కష్టపడ్డారని తెలిపారు. జిల్లా అభివృద్ధి, ఇక్కడ చరిత్ర సంస్కృతి పరిరక్షణకు మరింత శ్రమిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

అబాకస్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ఉపాధ్యాయులు

లక్ష్మణచాంద: జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన జోనల్ స్థాయి అబాకస్ పోటీల్లో మండల కేంద్రానికి చెందిన ద్రోణ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 24 మంది పాల్గొనగా ముగ్గురు కన్సోలేషన్ బహుమతి పొందారు. వీరికి బుధవారం పాఠశాలలో సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సురేశ్‌రెడ్డి, హెచ్‌ఎం గంగాధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీవనభృతి అందించాలి



నిరసన తెలుపుతున్న బీడీ కార్మికులు

నిర్మల్‌చైన్‌గేట్: బీడీ కార్మికులకు షరతులు లేకుండా రూ.4,016 జీవన భృతి ఇవ్వాలని తెలంగాణ బహుజన బీడీ కార్మిక సంఘం బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ సిద్దిరాములు కోరారు. తెలంగాణ బహుజన బీడీ కార్మిక సంఘం, బీఎల్‌టీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మహాలక్ష్మి కార్యాలయం నుంచి బీడీ కార్మికులు ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిద్దిరాములు మాట్లాడుతూ.. జీవనభృతిపై కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ బహుజన బీడీ కార్మిక సంఘం బీఎల్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగదీశ్, జిల్లా కన్వీనర్ పోసాని, బీఎల్‌టీయూ నాయకులు మహమూద్, అరుణ, బహుజన లెఫ్ట్ మహిళా సంఘం నాయకురాలు కళావతి, గల్ఫ్‌కార్మిక, ప్రవాస భారతీయ సంఘం నాయకుడు వెంకన్న పాల్గొన్నారు.

మరణాల నివారణకు చర్యలు



కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో మాతా మరణాలను నివారించడానికి చర్యలు చేపట్టామని డీఎంహెచ్‌వో ధనరాజ్ పేర్కొన్నారు. అధిక ప్రమాదం గల గర్భిణులను గుర్తించేందుకు జిల్లాలోని వైద్యాధికారులకు మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ సరోజ రెండురోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో శిక్షణ తరగతులు ప్రారంభించారు. శిక్షణ తరగతులను డీఎంహెచ్‌వో పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి తీసుకోవాల్సిన చికిత్సపై శిక్షణ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రొఫెసర్ డాక్టర్ సరోజ, డాక్టర్ సుస్మిత, అసిస్టెంట్ ప్రొఫెసర్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన కనెక్షన్లు

నిర్మల్‌చైన్‌గేట్: రైతులకు యుద్ధప్రాతిపదికన వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేస్తున్నట్లు నిర్మల్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ సుదర్శనం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గతేడాది జిల్లాలో 2,904 కనెక్షన్లు మంజూరు చేశామని పేర్కొన్నారు. ఈ స్టోర్ విధానం ద్వారా కావాల్సిన మెటీరియల్ తీసుకునే సౌలభ్యం ఉందని తెలిపారు. రైతుల విద్యుత్ సమస్యల పరిష్కారానికి 'పొలంబాట' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

భైంసాటౌన్: కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ బీజేపీ మాజీ ఎంపీ రమేశ్ బిదూరి దిష్టిబొమ్మను బుధవారం పట్టణంలోని బస్టాండ్ ఎదుట అంబేడ్కర్ విగ్రహం వద్ద దహనం చేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ సుమాన్ మాట్లాడుతూ.. రమేశ్ బిదూరిని బీజేపీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో స్థానికంగా బీజేపీ నాయకులను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. ముధోల్ నియోజకవర్గ అధ్యక్షుడు మహ్మద్ షఫీ, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ముత్యంరెడ్డి, నాయకులు సుదర్శన్ రెడ్డి, దీక్షిత్, ప్రసాద్, మహేశ్, మధు, సాహెబ్ రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: మహిళా సాధికారతే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేశ్, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్‌తో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సోలార్ ప్లాంట్ల ఏర్పాటు ప్రక్రియపై ప్రగతిని సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతీ నియోజకవర్గంలో సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు, మినీ ఇండస్ట్రియల్ ఏరియాల ఏర్పాటుకు స్థల సేకరణపై దృష్టి సారించాలని సూచించారు. క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ అభిలాష అభినవ్, డీఆర్డీవో విజయలక్ష్మి, డీటీడబ్ల్యూవో అంబాజీ, అధికారులు పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్లకు స్థలాలు గుర్తించాలి

సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అనువైన స్థలాలను గుర్తించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. అన్ని మండలాల్లో ప్రస్తుత విద్యుత్ ఉప కేంద్రాలకు సమీపంలోని ప్రభుత్వ భూములు, వినియోగానికి వీలుకాని భూములను గుర్తించి నివేదికలను సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల సర్వే వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్వే వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, జెడ్పీ సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్, డీఆర్డీవో విజయలక్ష్మి, ఏడీ ల్యాండ్ సర్వేయర్ సుదర్శన్, గిరిజనాభివృద్ధి అధికారి అంబాజీ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్యం సాధిస్తేనే స్వయం ఉపాధి



విద్యార్థులతో మాట్లాడుతున్న పరశురాం

భైంసాటౌన్: విద్యార్థులు వృత్తివిద్యలో నైపుణ్యం సాధిస్తేనే స్వయం ఉపాధి అవకాశాలుంటాయని డీఐఈవో పరశురాం పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని గురుకృపా వొకేషనల్ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. వృత్తివిద్య కోర్సులతో వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందాలని సూచించారు. ఆయన వెంట కళాశాల డైరెక్టర్ డాక్టర్ ముష్కం రామకృష్ణగౌడ్, ప్రిన్సిపాల్ సాయినాథ్, అధ్యాపకులు నరేశ్‌గౌడ్, హరిత, శ్రీదేవి, మనీషా తదితరులు పాల్గొన్నారు.

పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

నిర్మల్‌చైన్‌గేట్: అటవీ అనుమతుల కోసం పరివేష్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. రెవెన్యూ, అటవీ శాఖల అధికారులతో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పరివేష్ పోర్టల్‌పై ఆమె సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అటవీ ప్రాంతాల్లోని గ్రామాల్లోబోర్లు, రోడ్లు వేయాలన్నా, వంతెనలు నిర్మించాలన్నా, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలన్నా అటవీశాఖ అనుమతులు తీసుకోవాలని సూచించారు. పోడు పట్టాలు కలిగిన రైతుల సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, ఆర్డీవోలు రత్నకల్యాణి, కోమల్‌రెడ్డి, జిల్లా అటవీ అధికారి నాగినిభాను, రెవెన్యూ, అటవీశాఖ అధికారులు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

వెనుకబడినవారిపై దృష్టి పెట్టాలి

సోన్: చదువులో వెనుకబడిన విద్యార్థినులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా విద్యాధికారి రామారావు సూచించారు. బుధవారం మండలంలోని కేజీబీవీని పరిశీలించి సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. సిబ్బంది సమ్మె కారణంగా విద్యార్థినులకు సిలబస్ పూర్తి కాలేదని, ప్రత్యేక తరగతులు నిర్వహించి పాఠ్యాంశాలు పూర్తి చేయాలని సూచించారు. పదో తరగతి విద్యార్థినులను వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలని ప్రత్యేకాధికారి లతాదేవిని ఆదేశించారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈవో రామారావు

దొంగనోట్ల కలకలం



దొంగనోట్లతో మోసపోయిన వృద్ధుడు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో బుధవారం దొంగనోట్లు కలకలం సృష్టించాయి. స్థానిక గాంధీ కూరగాయల మార్కెట్‌లో వృద్ధుడు కూరగాయలు, నువ్వులు విక్రయిస్తున్నాడు. ఆ వృద్ధుడి వద్దకు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి రూ.200 నోట్లు రెండిచ్చి నువ్వులు కొనుగోలు చేసి వెళ్లిపోయారు. పక్కనే ఉన్న మరో వ్యక్తి గమనించి అవి నకిలీ నోట్లుగా గుర్తించాడు.

నూతన నియామకం



దుర్గాభవాని

కడెం: కాంగ్రెస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా మండల కేంద్రానికి చెందిన చొప్పదండి దుర్గభవాని నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు ఇటీవల నియమాక జాబితా విడుదల చేశారు. గత రెండు పర్యాయలు అధ్యక్షురాలిగా పనిచేసిన దుర్గభవాని మూడోసారీ పదవి చేపట్టనున్నారు. తన నియామకానికి కృషి చేసిన ఇన్‌చార్జి మంత్రి సీతక్క, స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్‌కు దుర్గాభవాని కృతజ్ఞతలు తెలిపారు.



కృష్ణవేణి

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలుగా నిర్మల్ పట్టణానికి చెందిన అల్లూరి కృష్ణవేణిని నియమిస్తూ పార్టీ అధిష్టానం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబకు, ఇతర నాయకులకు ఈ సందర్భంగా కృష్ణవేణి కతజ్ఞతలు తెలిపారు.

'మరింత చేరువలో పోలీస్ సేవలు'



ఫిర్యాదు స్వీకరిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

భైంసాటౌన్: నూతన ఏడాదిలో జిల్లా ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ జానకీ షర్మిల తెలిపారు. పట్టణంలోని పాత రూరల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలోని ఎస్పీ ట్రాన్సిట్ క్యాంప్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజావాణిలో పాల్గొన్నారు. ఏఎస్పీ అవినాష్‌కుమార్‌తో కలిసి డివిజన్ పరిధిలోని పలువురి నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. వారితో ఆప్యాయంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఫిర్యాదుల తక్షణ పరిష్కారం కోసం సంబంధిత ఎస్సైలు, సీఐలతో ఫోన్‌లో మాట్లాడి సమస్య స్థితిని తెలుసుకుని పరిష్కారానికి సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. 'నిర్మల్ పోలీస్.. మీ పోలీస్'లో భాగంగా ఇకపై ప్రతీ బుధవారం తాను భైంసాలోని క్యాంప్ కార్యాలయంలో ఉదయం 11గంటల నుంచి అందుబాటులో ఉంటానని తెలిపారు. డివిజన్ పరిధిలోని ప్రజలు నిర్భయంగా, స్వచ్ఛందంగా సేవలు వినియోగించుకోవాలని సూచించారు. కాగా, గతంలో ఎన్నడూలేని విధంగా ఎస్పీ ప్రజల వద్దకే వచ్చి ఫిర్యాదులు స్వీకరించడంపై ఫిర్యాదుదారులు హర్షం వ్యక్తం చేశారు.

పోస్టర్ ఆవిష్కరణ

భైంసా పట్టణంలోని ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఇంపాక్ట్ ప్రోగ్రాం పోస్టర్‌ను ఎస్పీ జానకీ షర్మిల ఆవిష్కరించారు. ఏఎస్పీ అవినాష్‌కుమార్, ఆనంది ఫౌండేషన్ చైర్మన్ వాడేకర్ లక్ష్మణ్, సీఐలున్నారు.

'ఆధ్యాత్మికతతో అంతా శుభమే..'



సాయిపల్లకిని ఊరేగిస్తున్న భక్తులు

నిర్మల్: నిత్యజీవితంలో ఆధ్యాత్మికతను అలవర్చుకుంటే మనస్సు ప్రశాంతంగా ఉంటుందని, అంతా శుభమే జరుగుతుందని షిరిడీకి చెందిన వికాస్‌మహరాజ్ అన్నారు. సాయిదీక్షా సేవాసమితి ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో వారంపాటు కొనసాగిన సాయి మహాపారాయణం ముగిసింది. ముగింపు ఉత్సవంలో భాగంగా బుధవారం ఉదయం పారాయణం చేసి, పట్టణ ప్రధాన వీధులలో సాయి పల్లకి ఊరేగించారు. కాలనీల్లో మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణంలో షిరిడీ నుంచి తీసుకువచ్చిన పాదుకలను దర్శించుకున్న తర్వాత మధ్యాహ్న హారతి నిర్వహించారు. భక్తులకు నిర్వాహకులు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో సాయిదీక్ష సేవాసమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్‌రెడ్డి, సభ్యులు రాంరెడ్డి, జైపాల్‌రెడ్డి, నందు, పండరి, కృష్ణ, శ్రీనివాస్, కోల శంకర్, రేఖ, రమ, జొన్నల మనోహర్, మహేందర్ యాదవ్, నారాయణరెడ్డి, తిరుపతి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



కళ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న కార్మికులు

కడెం: గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సునారికారి రాజేశ్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్మికులు మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. నాలుగు నెలలుగా వేతనాలు లేక కుటుంబపోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తంజేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి దుర్గం లింగన్న తదితరులున్నారు.

క్లుప్తంగా

బంగారు మైసమ్మ ఆలయంలో చోరీ

బెల్లంపల్లి: మండలంలోని కన్నాల శివారు జాతీయ రహదారి పక్కన ఉన్న బంగారు మైసమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. తాళ్ల గురిజాల ఎస్సై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి గుడి తలుపులు పగుల గొట్టి లోపలికి చొరబడ్డారు. బీరువాలోని 15 తులాల వెండి, పావు తులం బంగారు ముక్కు పుడకను దొంగిలించారు. బుధవారం ఉదయం బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ గుడిని సందర్శించారు. పోలీసు జాగిలాలు, క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. గుడి నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

భీమారం: అక్రమంగా రేషన్‌బియ్యం తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని ఆరెపల్లిలోని రేషన్‌దుకాణం నుంచి మంగళవారం రాత్రి ఆటోలో బియ్యం తరలిస్తుండగా డయల్ 100కు సమాచారం అందించారు. పోలీసులు ఆటోను స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. బుధవారం సివిల్ సప్లయిస్ డీటీ స్రవంతి రేషన్‌దుకాణాన్ని సందర్శించి నిల్వలో తేడా ఉన్న 11క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. డీలర్ స్వర్ణలతపై కేసు నమోదుచేశారు.

వ్యక్తిపై కేసు

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ గ్రామానికి చెందిన అబ్దుల్లాపూర్ బోజారెడ్డి అనే వ్యక్తి పోలీసులతో దురుసుగా ప్రవర్తించడంతో అతడిపై కేసు నమోదు చేశారు. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. లోకేశ్వరం పోలీసులు మంగళవారం సాయంత్రం మండలంలోని మన్మద్ ఎక్స్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. అబ్దుల్లాపూర్ భోజారెడ్డి మద్యం సేవించి ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్న క్రమంలో అతడిని ఆపారు. డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ ప్రవల్‌పై దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో భోజారెడ్డిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కోడిపందేల నిర్వాహకుల బైండోవర్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల పరిధిలో గతంలో కోడి పందేలు నిర్వహించిన నలుగురు వ్యక్తులను బుధవారం హాజీపూర్ పోలీసులు హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే ఎదుట బైండోవర్ చేశారు. హాజీపూర్ మండల పరిధిలో ఎలాంటి కోడిపందేలు నిర్వహించకుండా బైండోవర్ చేసినట్లు ఎస్సై గోపతి సురేశ్ తెలిపారు.

చిరుత దాడిలో ఆవు మృతి

బజార్‌హత్నూర్: మండలంలోని కొత్తగూడ అటవీ ప్రాంతంలో రెండు రోజుల క్రితం చిరుత దాడిలో ఆవు మృతి చెందింది. ఎఫ్ఆర్‌వో పుండలిక్ తెలిపిన వివరాల ప్రకారం.. బజార్‌హత్నూర్ గ్రామ రైతు ప్రశాంత్ దేశ్‌పాండేకు చెందిన ఆవులను కాపరి గ్రాసం నిమిత్తం సోమవారం కొత్తగూడ అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లాడు. అందులో రెండు ఆవులు తప్పిపోయాయి. దీంతో రైతు గ్రామస్తులతో కలిసి బుధవారం అటవీ ప్రాంతంలో గాలించగా ఒక ఆవు కళేబరం లభ్యమైంది. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. డిప్యూటీ ఎఫ్ఆర్‌వో ప్రవీణ్, ఎఫ్‌బీవో తిరుపతి తదితరులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. చిరుత దాడిలో ఆవు మృతి చెందినట్లు నిర్ధారించారు. మరో ఆవు జాడ మాత్రం లభ్యం కాలేదు. కాగా, యజమానికి పరిహారం అందజేస్తామని ఎఫ్ఆర్‌వో తెలిపారు.

రైల్వేలైన్ మళ్లీ మొదటికి..!

- తెరపైకి ఆర్మూర్–నిర్మల్–ఆదిలాబాద్ లైన్
- తాజాగా కేంద్రమంత్రిని కలిసిన 'ఏలేటి'
- సానుకూలంగా స్పందించిన అశ్వినీవైష్ణవ్
- మొన్నటి ఎన్నికల హామీ ఏమైంది?
- ఇప్పటికైనా.. కలల రైలు వచ్చేనా?



2017 జనవరి 23న ఢిల్లీలో అప్పటి కేంద్రమంత్రి సురేశ్‌ప్రభును కలిసిన అప్పటి మంత్రులు, ఎంపీ



గతేడాది సెప్టెంబర్‌లో ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ ప్రాంతంలో సర్వే చేస్తున్న రైల్వే సిబ్బంది

నిర్మల్: ఆర్మూర్–నిర్మల్–ఆదిలాబాద్ రైల్వేలైన్ కథ మళ్లీ మొదటికొచ్చింది. పాలకులు మారినప్పుడల్లా ఈ రైల్వేలైన్ ఏర్పాటు అంశం మొదటి నుంచి ప్రారంభమవుతోంది. ఎనిమిదేళ్ల క్రితం అప్పటి బీఆర్ఎస్ పాలకులు సీరియస్‌గా ఈ రైలుమార్గాన్ని పూర్తి చేస్తామంటూ ఇటు రాష్ట్ర ప్రభుత్వాన్ని, అటు ఢిల్లీని జాయింట్‌వెంచర్‌గా చేయడానికి ఒప్పించి వచ్చారు. ఏళ్లు గడిచినా.. కనీసం అడుగు కూడా ముందుకు పడలేదు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి ఆర్మూర్ నుంచి కాదని, హైదరాబాద్ నుంచి నిర్మల్ మీదుగా ఆదిలాబాద్ వరకు భారీ బడ్జెట్‌తో రైల్వేలైన్ నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేశామని చెప్పారు. ఇది కూడా ఇప్పటిదాకా ఊసులేదు. ఇక తాజాగా మంగళవారం బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌ను కలిశారు. మళ్లీ ఆర్మూర్–నిర్మల్–ఆదిలాబాద్ లైన్ పూర్తి చేయాలని కోరడం గమనార్హం. దీంతో అసలు.. ఈ లైన్ ఎప్పటికి ప్రారంభమవుతుందో.. ఎన్నాళ్లకు పూర్తవుతుందోనని నిర్మల్, ఆదిలాబాద్ ప్రజలు చర్చించుకుంటున్నారు.

అలా మొదలై..

నిర్మల్–ఆదిలాబాద్‌కు ఇటు రాష్ట్ర, అటు జాతీయ సంబంధాలు, అభివృద్ధి పనులు, రవాణావ్యవస్థ మెరుగవ్వాలంటే పక్కా రైల్వేలైన్ ఉండాలన్న డిమాండ్ దశాబ్దాల నుంచి ఉంది.

- 1991లో ఆదిలాబాద్ ఎంపీగా ఉన్నప్పుడు అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు దృష్టికి తీసుకెళ్లారు. అప్పట్లో పలుసార్లు కేంద్ర బడ్జెట్‌లో 'ఆదిలాబాద్‌లో కొత్త రైల్వేలైన్ సర్వే కోసం నిధులు కేటాయిస్తున్నాం..' అంటూ ప్రకటించారు.
- ఉమ్మడిజిల్లా నుంచి కేంద్రమంత్రిగా చేసిన వేణుగోపాలాచారి, ఆ తర్వాత ఎంపీలూ కొంతమేర ప్రయత్నం చేశారు.
- 2016లో పెద్దపల్లి–నిజామాబాద్ రైల్వేలైన్ పూర్తయిన నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న నిర్మల్–ఆదిలాబాద్ లైన్ ఏర్పాటుపై 'రైలురాక కలేనా..' శీర్షికన డిసెంబర్ 26న 'సాక్షి' బ్యానర్ కథనాన్ని ప్రచురించింది.
- దీంతో ఎనిమిదేళ్లక్రితం 2017 జనవరి 23న అప్పటి సీఎం కేసీఆర్ జాయింట్‌వెంచర్ కింద నిర్మాణానికి ఒప్పుకొంటూ రాసిచ్చిన లెటర్‌తో అప్పుడు మంత్రులుగా ఉన్న అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, జోగు రామన్న, అప్పుడూ ఎంపీగానే ఉన్న ప్రస్తుత ఎంపీ నగేశ్ ఢిల్లీ వెళ్లారు. అప్పటి రైల్వేమంత్రిగా ఉన్న సురేశ్‌ప్రభును కలిశారు. ఈమేరకు ఆర్మూర్–నిర్మల్–ఆదిలాబాద్ రైల్వేలైన్ రాష్ట్రంతో కలిసి జాయింట్ వెంచర్‌గా నిర్మించేందుకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.
- 2017–18లోనే చేసిన ప్రాథమిక సర్వే మేరకు ఆర్మూర్ నుంచి నిర్మల్ మీదుగా ఆదిలాబాద్ వరకు దాదాపు 125కిలో మీటర్ల దూరం రైల్వేలైన్ నిర్మాణానికి గాను రూ.2,720కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఈలెక్కన రాష్ట్రం దాదాపు రూ.1,300కోట్ల వరకు ఖర్చుచేయాల్సి వస్తుండటంతో వెనుకంజ వేసింది. ఎనిమిదేళ్లు గడిచినా కనీసం జాయింట్‌వెంచర్‌కు సంబంధించి ఎంఓయూ (మెమోరాండమ్ ఆఫ్ అండర్‌స్టాండింగ్)కూ రాలేదు.

కేంద్రమంత్రిని కలిసిన 'ఏలేటి'

తీరని కలగానే మిగిలిన రైలు కథ తాజాగా మళ్లీ మొదటికొచ్చింది. నిర్మల్ ఎమ్మెల్యే, బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నిజామాబాద్ ఎంపీ అర్వింద్‌తో కలిసి మంగళవారం రైల్వేమంత్రి అశ్వినీవైష్ణవ్‌ను కలిశారు. ఈ భేటీలో ప్రధానంగా నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలను కలిపే ఆర్మూర్–నిర్మల్–ఆదిలాబాద్ రైల్వేలైన్‌ను నిర్మించాలని వారు మంత్రి కోరారు. ఈమేరకు అశ్వినీవైష్ణవ్ కూడా హామీ ఇవ్వడం గమనార్హం. మరోవైపు గత పరిణామాల నేపథ్యంలో నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల వాసుల్లో ఇప్పటికీ అనుమానాలే ఉన్నాయి. కానీ.. మూడు జిల్లాల పరిధిలో ఎంపీలతో పాటు ఆరు ఎమ్మెల్యే స్థానాలను బీజేపీ గెలవడం, ఏలేటి ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవడంతో ఈసారి రైల్వేలైన్ పూర్తవుతుందనే ఆశాభావాన్ని వ్యక్తంచేస్తున్నారు.

హైదరాబాద్ నుంచి వేస్తామని..

రైల్వేలైన్‌పై 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల వేళ మళ్లీ కదలిక వచ్చింది. అప్పుడూ కేంద్రమంత్రిగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగానే ఉన్న కిషన్‌రెడ్డి పలు రైల్వేమార్గాలపై మాట్లాడుతూ.. ఆదిలాబాద్ నుంచి నిర్మల్, ఆర్మూర్, నిజామాబాద్, బోధన్, బాన్సువాడ, నిజాంపేట్, సంగారెడ్డి మీదుగా పటాన్‌చెరు వరకు రూ.5,706 కోట్లతో లైన్ నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు. మూడు దశాబ్దాల క్రితం ఆదిలాబాద్, నిర్మల్, ఆర్మూర్, డిచ్‌పల్లి మీదుగా పటాన్‌చెరు వరకు రైల్వేలైన్ ప్రతిపాదన ఉండేది. ఆ మార్గాన్నే మారుస్తూ ఎన్నికలకు ముందు కేంద్ర మంత్రి కొత్త ప్రతిపాదన తీసుకువచ్చారు. ఇక రాష్ట్రంతో జాయింట్ వెంచర్‌గా కాకుండా కేంద్రమే ప్రతిపాదిస్తుందని కేంద్ర మంత్రి చెప్పడం, ఈమేరకు ఓ సర్వే కూడా పూర్తి కావడంతో నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల వాసుల్లో మళ్లీ ఆశలు రేకెత్తాయి.

మద్యానికి బానిసై యువకుడి బలవన్మరణం



సాయి మృతదేహం

సారంగపూర్: మండలంలోని స్వర్ణ గ్రామానికి చెందిన రాజుల సాయి (35) మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజు కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో మంగళవారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చిన అతడితో కుటుంబీకులు గొడవపడ్డారు. దీంతో అర్ధరాత్రి ఇంటినుంచి బయటకు వెళ్లిన సాయి పురుగుల మందు తాగి వచ్చాడు. గమనించిన కుటుంబీకులు 108కు సమాచారమిచ్చారు. వారు నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. సాయి భార్య నాలుగేళ్ల క్రితమే పుట్టింటికి వెళ్లిపోగా తల్లి భోజవ్వతోనే ఉంటున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

నిర్మల్‌టౌన్: నిర్మల్ పట్టణంలోని బంగల్‌పేట్ మహాలక్ష్మి వాడ కాలనీకి చెందిన సోమ్మయ్య(35) ఓ మామిడి తోటలో అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. బుధవారం ఉదయం అటువైపు వెళ్తున్న స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ ఘటన స్థలాన్ని డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీ చేశారు. కాగా, సోమయ్య స్నేహితులతో కలిసి దావత్ చేసుకోవడానికి మంగళవారం బయటకు వెళ్లాడు. అక్కడ రాము, మరో ఇద్దరు స్నేహితులతో గొడవ జరిగిందని, రాము బాగా తిట్టాడని, ఇంటిని రానని సోమయ్య తనకు ఫోన్ చేసి చెప్పినట్లు ఆయన భార్య లక్ష్మి తెలిపింది. మరుసటి రోజు ఉదయం ఉరేసుకుని కనిపించాడు. స్నేహితులపై అనుమానం వ్యక్తం చేస్తూ లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ పేర్కొన్నారు. కాగా, మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆటో బోల్తా: పలువురికి గాయాలు



అంబులెన్సులో క్షతగాత్రులు

ముథోల్: మండల కేంద్రంలోని నయాబాదిలో ఆటో బోల్తా పడగా పలువురు గాయపడ్డారు. వివరాలు.. ముథోల్ నుంచి అబ్దుల్లాపూర్‌కు వరి నాటు వేసేందుకు బుధవారం ముథోల్‌కు చెందిన ఎనిమిది మంది కూలీలు ఆటోలో వెళ్తున్నారు. నయాబాదికి రాగానే కుక్క అడ్డు రాగా అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అందరికీ గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారమిచ్చి అంబులెన్స్‌లో క్షతగాత్రులను భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. వీరిలో గంగామణి కాలు, పోశెట్టికి పక్కటెముకలు విరిగినట్లు 108 సిబ్బంది తెలిపారు. గణిత, శిల్పకు తీవ్రగాయాలు, లక్ష్మి, స్వరూప, రజిత, లక్ష్మి, డ్రైవర్ అంజుకు స్వల్పగాయాలయ్యాయి.

ఆటోబోల్తా ఘటనలో మరో ఇద్దరు మృతి

బజార్‌హత్నూర్: మండలంలోని దేగామ సమీపంలో మంగళవారం ఆటో బోల్తా పడిన ఘటనలో తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరు చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందారు. ఎస్సై అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం.. దేగామ గ్రామ సమీపంలో మూలమలుపులో గిర్నూర్ గ్రామానికి చెందిన ఆటో అదుపు తప్పి బోల్తా పడిన విషయం తెలిసిందే. గ్రామానికి చెందిన మహిళ అడెళ్ల(35) అక్కడికక్కడే మృతిచెందగా.. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడడంతో ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో మైలారపు అరుణ్(22), అయిల ఆశన్న(68) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో బుధవారం చనిపోయారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

విద్యుత్ స్తంభం పైనుంచి పడి కార్మికుడి మృతి

ఆదిలాబాద్‌టౌన్: విద్యుత్ స్తంభంపై నుంచి పడి కార్మికుడు మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గుడిహత్నూర్ మండలం సీతాగోంది గ్రామానికి చెందిన పెందూర్ అరుణ్ (30) విద్యుత్ కాంట్రాక్టర్ వద్ద కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఆదిలాబాద్ పట్టణంలోని నేతాజీ చౌక్ ప్రాంతంలో మంగళవారం కేబుల్ వైర్ కాలిపోవడంతో దాన్ని సరిచేస్తున్నాడు. ఈ క్రమంలో సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఇన్వర్టర్ నుంచి విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై స్తంభం నుంచి కింద పడ్డాడు. కుటుంబీకులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఇది వరకు అదే ప్రాంతంలో విద్యుత్ మరమ్మతులు చేస్తున్న సమయంలో ఇన్వర్టర్ నుంచి విద్యుత్ సరఫరా కావడంతో ఇద్దరు కార్మికులు మృత్యువాత పడ్డ సంఘటనలు చోటు చేసుకున్నాయి. అయినా ఆ శాఖ అధికారులు, కాంట్రాక్టర్లు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో మరో నిండు ప్రాణం బలైందని పలువురు పేర్కొంటున్నారు. ఈ విషయమై విద్యుత్‌శాఖ ఎస్ఈ జేఆర్ చౌహాన్‌ను వివరణ కోరగా మృతుడి కుటుంబానికి శాఖ తరఫున రూ.5లక్షల పరిహారం అందించనున్నట్లు పేర్కొన్నారు.

మొరం ట్రాక్టర్ల పట్టివేత



పట్టుకున్న మొరం ట్రాక్టర్లు

ఖానాపూర్: పట్టణంలోని కుమురంభీం చౌరస్తాలో అక్రమంగా మొరం తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం పట్టుకున్నామని తహసీల్దార్ శివరాజ్ తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్లను స్థానిక కార్యాలయానికి తరలించామని పేర్కొన్నారు.

నిందితుడికి జైలు

కడెం: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతికి కారణమైన మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామానికి చెందిన బానావత్ లక్ష్మణ్‌కు బుధవారం ఖానాపూర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జితిన్ కుమార్ 45రోజుల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధించారు. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. 2019 మార్చి 14న మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామ బస్టాప్ వద్ద బానావత్ లక్ష్మణ్ టాటా మ్యాజిక్‌తో బైక్‌ను ఢీకొట్టగా, బైక్‌పై ప్రయాణిస్తున్న మామడ మండలం పొన్కల్ గ్రామానికి చెందిన పందిరి రాజేశ్వర్ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య రాధ ఫిర్యాదు మేరకు 2019లో నమోదైన కేసు దర్యాప్తులో భాగంగా బుధవారం సాక్షులను ప్రవేశపెట్టగా మెజిస్ట్రేట్ జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

చోరీ కేసుల్లో వ్యక్తికి..

దండేపల్లి: నిర్మల్ జిల్లా దస్తూరాబాద్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ రజాక్‌కు రెండు చోరీ కేసుల్లో లక్సెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి ఆసదుల్లా షరీఫ్ బుధవారం శిక్ష విధించారు. దండేపల్లి ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. రజాక్ చెడు వ్యసనాలకు అలవాటు పడి దొంగతనాలు చేస్తున్నాడు. గత ఏడాది ఆగస్టు 22న దండేపల్లి మండలం మేదరిపేట గ్రామానికి చెందిన కాంద్రపు సరస్వతి ఇంటి తాళాలు పగులగొట్టి తులం బంగారు చైను, రూ.5వేల నగదు దొంగిలించాడు. సెప్టెంబర్ 27న దండేపల్లి మండలం గూడెం గ్రామానికి చెందిన చుంచు సురేష్ ఇంట్లో పట్టపగలే రూ.20వేల నగదు అపహరించాడు. ఈ కేసుల్లో 3 నెలల 6 రోజులు, మరో కేసులో 2 నెలల 23 రోజుల శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించారు.

ఒకరిపై కేసు

నర్సాపూర్ (జి): నిర్మల్ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఆదేశానుసారం ఆపరేషన్ స్మైల్–11లో భాగంగా లేబర్ డిపార్ట్‌మెంట్ జూనియర్ అసిస్టెంట్ మహేశ్, డీసీపీవో దేవి మురళి, ఎస్‌బీపీ సాదిక్ హుస్సేన్ బుధవారం నర్సాపూర్ (జి) బస్టాండ్ ఏరియాలో తనిఖీలు చేపట్టారు. శ్రీలక్ష్మి పానీపూరి బండి యజమాని శంకర్ వద్ద ఇద్దరు మైనర్ బాలురు పనిచేస్తూ వీరికి పట్టుబడ్డారు. జూనియర్ అసిస్టెంట్ మహేశ్ ఫిర్యాదు మేరకు పానీపూరి బండి యజమాని శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు.

ఉత్పత్తిలో తగ్గేదేలే..!

- రికార్డుల గని ఆర్కే–6
- ఎస్‌డీఎల్ ఉత్పత్తిలో కంపెనీ స్థాయిలో మొదటి స్థానం
- ఇప్పటికే ఐదుసార్లు అవార్డులు కైవసం
- ఆదర్శంగా నిలుస్తున్న భూగర్భ గని



గనిలో ఎస్‌డీఎల్ యంత్రం

ఎస్‌డీఎల్ సాధించిన బొగ్గు ఉత్పత్తి వివరాలు

సంవత్సరం	రోజుకు టన్నులు	శాతం
2019–20	173	114
2020–21	155	88
2021–22	130	101
2022–23	114	116
2023–24	107	108

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే–6 గని రికార్డు గనిగా పేరు సాధించింది. కంపెనీ వ్యాప్తంగా ఉన్న 22 భూగర్భ గనుల్లో ఎస్‌డీఎల్ సెక్షన్‌లో అత్యధిక బొగ్గు ఉత్పత్తి సాధిస్తున్న గనిగా రికార్డులు నెలకొల్పుతోంది. ప్రతీ సంవత్సరం తన రికార్డును తానే తిరగరాస్తూ ఇతర గనులకు ఆదర్శంగా నిలుస్తోంది. ఈ గనిలో సగటున ఒక్కో ఎస్‌డీఎల్ యంత్రం రోజుకు 110 టన్నుల పైబడి ఉత్పత్తి తీస్తోంది. కంపెనీ వ్యాప్తంగా ఇతర గనుల్లో కేవలం 95 టన్నుల వరకే ఉత్పత్తి తీస్తున్నారు. 2024 డిసెంబర్ 23న కొత్తగూడెంలో జరిగిన సింగరేణి ఆవిర్భావ వేడుకల్లో సంస్థ సీఎండీ బలరాం చేతుల మీదుగా గని అధికారులు, ఉద్యోగులు అవార్డు అందుకున్నారు.

2020 నుంచి అవార్డులు..

ఎస్‌డీఎల్ సెక్షన్‌లో అధిక ఉత్పత్తి సాధిస్తున్న గనుల్లో ఆర్కే–6 గని 2019–20 ఆర్థిక సంవత్సరం నుంచి వరుసగా ఐదుసార్లు ఈ అవార్డులు అందుకుంది. ప్రణాళికతో పని చేయడం వల్ల ఈ ఉత్పత్తి సాధిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ప్రతీ ఎస్‌డీఎల్ యంత్రానికి రెండు వర్కింగ్ ప్లేస్‌లు కేటాయించడం, టబ్బుల ట్రాక్ లైన్‌ను యంత్రానికి దగ్గర ఉండేలా ఏర్పాటు చేయడం, యంత్రాల బ్రేక్‌డౌన్లు లేకుండా నిర్ణీత సమయానికి నిర్వహణ చేపట్టడంతో పనితీరు మెరుగ్గా ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ఎస్‌డీఎల్ సెక్షన్‌లో రూఫ్ సపోర్టును పటిష్టంగా చేస్తున్నారు. ఈ గనిలో మొత్తం ఆరు ఎస్‌డీఎల్ యంత్రాలు నడుస్తున్నాయి. రెండు సీమ్‌ల్లో బొగ్గు తీస్తున్నారు. 765 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ఎన్నో రికార్డులు నమోదు చేసుకున్న ఈ గని నిల్వలు అడుగంటడంతో ఒకటి రెండేళ్లలో మూతపడనుండడం గమనార్హం.

సమష్టి కృషితోనే సాధ్యం



ఉద్యోగులు, సూపర్‌వైజర్లు, అధికారుల సమష్టి కృషితోనే ఎస్‌డీఎల్ సెక్షన్‌లో ఇప్పటికి ఐదు సార్లు కంపెనీ స్థాయిలో బెస్ట్ ఎస్‌డీఎల్ పెర్ఫార్మెన్స్ అవార్డు అందుకున్నాం. ఏరియా జీఎం, ఇతర ఉన్నత అధికారుల సహకారంతో లక్ష్య సాధన కోసం పని స్థలాల్లో కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నాం.

– ఈ.తిరుపతి, మేనేజర్, ఆర్కే–6 గని

సమయం దాటి పని చేస్తున్నాం



కంపెనీలోనే నెంబర్ వన్‌గా నిలువడం కోసం షిఫ్ట్ సమయం దాటిన కూడా పని చేస్తున్నాం. ప్రణాళికలతో పని చేయడం వల్లే ఈ లక్ష్యాన్ని సాధించాం. అధికారులతో సమన్వయం చేసుకుంటూ పని చేయడంతో మంచి ఫలితాలు సాధిస్తున్నాం.

– బండ సుదర్శన్, ఎస్‌డీఎల్ ఆపరేటర్

సొంతింటి పథకం అమలు చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ అధ్యక్షుడు రాజారెడ్డి

శ్రీరాంపూర్: కార్మికులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సొంతింటి పథకం అమలు చేయాలని సీఐటీయూ కేంద్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి యాజమాన్యం, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. సింగరేణి స్థలాల్లో కార్మికులకు ఇంటి స్థలం ఇవ్వాలని అన్నారు. కంపెనీ కార్మికులకు కేటాయించిన క్వార్టర్లకు నెలకు రూ.5 వేలు నిర్వహణ వస్తుందని, కార్మికుడు కూడా క్వార్టర్‌లో ఉండడం వల్ల అలవెన్సులపై నెలకు రూ.3 వేల వరకు ఐటీ చెల్లించాల్సి వస్తుందని, హెచ్ఆర్ఏ కూడా కార్మికులకు మిగులుతుందని తెలిపారు. ఇలా ఒక్కో కార్మికుడు కంపెనీ క్వార్టర్‌లో కాకుండా ఇంటిస్థలం కేటాయిస్తే రూ.15 వేల వరకు ఆదా అవుతాయని అన్నారు. సింగరేణి క్వార్టర్లను కూల్చి ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టాలని చూస్తే అడ్డుకుంటామని, పెండింగ్‌లో ఉన్న కార్మికుల మారుపేర్లను క్రమబద్ధీకరించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు నరహరిరావు, బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, నాయకులు కస్తూరి చంద్రశేఖర్, బానేష్, శ్రీనివాస్, సందీప్ కుమార్, రాజేష్, రాజబాబు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పెన్‌గంగ దాటిన పులి

- పాదముద్రలు గుర్తించిన అటవీశాఖ అధికారులు



పెన్‌గంగ ప్రాంతంలో పులి అడుగులను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: జైనథ్ మండలం కరంజి గ్రామంలో పులి సంచరిస్తున్నట్లు గుర్తించిన అటవీ శాఖ అధికారులు ప్రత్యేక బృందాలతో రెండు రోజులుగా గాలింపు చర్యలు చేపట్టారు. ఆ ప్రాంతంలో పది సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా అందులో ఎలాంటి ఆనవాళ్లు చిక్కలేదు. అయితే బుధవారం పెన్‌గంగ పరిసర ప్రాంతాల్లో పులి పాదముద్రలను గుర్తించినట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి గులాబ్ సింగ్ తెలిపారు. పెన్‌గంగ దాటి మహారాష్ట్ర వైపు వెళ్లినట్లు పేర్కొన్నారు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, అయితే పంట చేలకు వెళ్లినప్పుడు గుంపులు గుంపులుగా, చప్పుడు చేసుకుంటూ వెళ్లాలని సూచించారు.

రెండు తలల పామును తరలిస్తున్న ముఠా పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న ఫారెస్ట్ అధికారి

చెన్నూర్: రెండు తలల పామును తరలిస్తున్న ముఠాను అటవీ అధికారులు మాటు వేసి పట్టుకున్నారు. స్థానిక ఫారెస్ట్ కార్యాలయంలో బుధవారం ముఠా వివరాలను ఫారెస్ట్ రేంజ్ అధికారి శివకుమార్ వెల్లడించారు. మహారాష్ట్ర నుంచి చెన్నూర్ మీదుగా రెండు తలల పామును కొందరు వ్యక్తులు తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఈ నెల 6న చెన్నూర్ మండలం చింతలపల్లి గ్రామంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఓ కారులో రెండు తలల పామును గుర్తించారు. పాముతోపాటు కారు, మోటార్‌సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. కోటపల్లి మండలం సర్వాయిపేట గ్రామానికి చెందిన కదార్ల ధనుంజయ్, కొల్లూరు గ్రామానికి చెందిన కొరాళ్ల సంతోశ్, బోరంపల్లి గ్రామానికి చెందిన దుర్గం రాజ్‌గోపాల్, చెన్నూర్‌కు చెందిన వేములు తిరుపతి, శ్రీరాంపూర్‌కు చెందిన కుంభం పోచిరెడ్డి, మహారాష్ట్రలోని కొప్పుల గ్రామానికి చెందిన సుదర్శన్, ప్రభాకర్ ముఠాగా ఏర్పడి పామును తరలిస్తున్నారని విచారణలో తేలింది. ఏడుగురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చామని తెలిపారు. సమావేశంలో అటవీ అధికారులు ప్రభాకర్, చంద్రమోహన్ పాల్గొన్నారు.

గుప్త నిధుల కోసం..!

రెండు తలల పాము గుప్త నిధులను పట్టిస్తుందని కొందరు నమ్ముతారు. దీంతో గుప్త నిధుల వేటగాళ్లు రెండు తలల పామును కొనుగోలు చేస్తారని తెలిసింది. ఈ పామును రూ.40 లక్షలకు అమ్మేందుకు తరలిస్తుండగా పట్టుబడినట్లు ప్రచారం జరుగుతోంది.

నేటి నుంచి ఫుట్‌బాల్ పోటీలు

- రాష్ట్ర స్థాయి అండర్–13 బాలికల చాంపియన్‌షిప్
- పాల్గొననున్న ఆయా జిల్లాల జట్లు

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్‌లో తెలంగాణ స్థాయి బాలికల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు గురువారం ప్రారంభం కానున్నాయి. ఐదు రోజుల పాటు పోటీలు నిర్వహిస్తారు. ఖేలో ఇండియా గేమ్స్‌లో భాగంగా నిర్వహించే ఈ పోటీలకు తెలంగాణలోని ఆయా జిల్లాల జట్లు హాజరవుతున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలకు స్థానిక ఠాగూర్ స్టేడియం ముస్తాబైంది. ఉదయం పది గంటలకు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ లాంఛనంగా పోటీలు ప్రారంభించనున్నారు.

పాల్గొనే జట్లు ఇవే...

తెలంగాణ(సౌత్‌జోన్) బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో రాష్ట్రం నుంచి మొత్తం ఆరు జట్లు పాల్గొననున్నాయి. ఎలెవన్‌స్టార్ ఫుట్‌బాల్ అకాడమీ పేరిట ఆతిథ్య ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు, ట్విన్‌సిటీస్ హైదరాబాద్ జట్టు, తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ జట్టు, కేర్ ఫుట్‌బాల్ అకాడమీ నిజామాబాద్ జట్టు, గజ్వేల్ ఫుట్‌బాల్ అకాడమీ సిద్దిపేట జట్టు, వుమెన్స్ ఫుట్‌బాల్ అకాడమీ(హైదరాబాద్, ఖమ్మం కంబైన్డ్) జట్లు పాల్గొంటాయి. లీగ్ పద్ధతిలో నిర్వహించనుండగా ఒక్కో జట్టు మిగతా ఐదు జట్లతో తలపడుతుంది. లీగ్ పోటీల్లో ప్రతిభ కనబరచి ఉత్తమంగా నిలిచిన నాలుగు జట్లు సెమీస్‌లో తలపడతాయి.